సాక్షి
వికారాబాద్
సోమవారం : 12 : మే : 2025



పత్తి రైతుకు విత్తన భారం

ఏటేటా పెరుగుతున్న విత్తనాలు, ఎరువుల ధరలతో రైతులకు అదనపు భారం పడుతోంది. 8లో▸



సేవాభావాన్ని ..

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. 8లో▸



చెత్త సేకరణేదీ?

మోమిన్‌పేట యూనియన్ బ్యాంకు కాలనీల్లో చెత్త సేకరణ నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు మంత్రి పర్యటన

అనంతగిరి: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ 12న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. పరిగి, వికారాబాద్ పర్యటనలో చేపట్టాల్సిన అంశాలపై వైద్యారోగ్యశాఖ అధికారులతో ఆదివారం మధ్యాహ్నం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం 12.30గంటలకు పరిగి పట్టణ కేంద్రంలో వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు భూమి పూజ, వికారాబాద్ కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో ఆస్పత్రుల పనితీరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. అనంతరం వికారాబాద్‌లో నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంట రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

బషీరాబాద్: వానాకాలం పంటలకు రైతులకు రూ.50 లక్షలతో కొత్తగా పంట రుణాలు ఇస్తున్నామని నావంద్గీ(బషీరాబాద్) సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీలో ఉంటూ రుణం పొందలేని వారు సోమవారం నుంచి కొత్త రుణాలను తీసుకోవచ్చన్నారు. మొదటి విడతగా జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ ఈ రుణాన్ని నావంద్గీ సొసైటీకి మంజూరు చేసిందని చెప్పారు. గతంలో సొసైటీ నుంచి రుణమాఫీ పొందిన రైతాంగానికి సైతం కొత్త రుణాలను అందజేస్తామని వివరించారు. కొత్తగా రుణం పొందే రైతులు భూమికి సంబంధించి తాజా పహానీ, వన్‌బీ, నో డ్యూస్ సర్టిఫికెట్, నాలుగు రైతు ఫొటోలు నావంద్గీ సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు 50 వసంతాల స్ఫూర్తి సభ

కొడంగల్ రూరల్: అరుణోదయ సాంస్కృతిక విజ్ఞాన సమాఖ్య 50 వసంతాల స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం 10గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఉదయం 9గంటల ర్యాలీతో ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజా సంస్కృతి, ప్రజా సాంస్కృతికోద్యమ నిర్మాణంపై చర్చ, రాత్రి కల్చరల్ ప్రోగ్రామ్స్ ఉంటాయని వివరించారు. ఉద్యమకారులు, కవులు, కళాకారులు, అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వివాహ వేడుకలో స్పీకర్



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

తాండూరు రూరల్: తన చిన్ననాటి స్నేహితుడి ఇంట్లో జరిగిన వివాహ వేడుకలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. ఆదివారం పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో గౌతపూర్ మాజీ సర్పంచ్ రాజప్పగౌడ్ కుతూరు అంజలిగౌడ్ వివాహం బషీరాబాద్ మండలం గొట్టిగ ఖుర్దుకు చెందిన మహేష్‌కుమార్ గౌడ్‌తో నిర్వహించారు. ఈ వివాహానికి హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ నూతన దంపతులను ఆశీర్వదించి చిన్ననాటి స్నేహితులతో సరదగా గడిపారు.

తప్పుల తడకగా ఇందిరమ్మ ఇళ్ల జాబితా

- రీసర్వే చేయించి అర్హులకు కేటాయించాలి
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా తప్పులతడకగా ఉందని.. ఎమ్మెల్యే వెంటనే స్పందించి రీసర్వే చేయించి పారదర్శకంగా అర్హులకే దక్కేలా చూడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని అభాగ్యులకు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ లీడర్లకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి అర్హులకు దక్కేలా చూడాలని లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

జవాన్ల కోసం జలాభిషేకం



ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం, సైన్యానికి మద్దతుగా ఆదివారం బుగ్గ రామలింగేశ్వరాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భారత సైనికులకు మరింత బలాన్ని చేకూర్చాలని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. – అనంతగిరి

కరుణామయి అమ్మ



సృష్టికి మూలం అమ్మ.. అనురాగం, ఆప్యాయతను పంచే కరుణామయి. తల్లి పేగుబంధం విడదీయని అనుబంధం. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా వికారాబాద్ రామయ్యగూడ ఎంబజీలోని ఇమాన్యుయేల్ ఏజీ చర్చిలో వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. – అనంతగిరి

‘ఉపాధి’కి కత్తెర

మొత్తం జాబ్ కార్డులు	1.83లక్షలు
కూలీల సంఖ్య	3.77లక్షలు
ప్రస్తుతం పనులు చేస్తున్న వారు	60 వేలు

నాలుగేళ్ల కాలంలో కోటి పనిదినాల తగ్గింపు

- పనులు దొరక్క కూలీల అవస్థలు
- శరాఘాతంగా మారిన కొత్త నిబంధనలు
- ఉదయం, సాయంత్రం ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే వేతనం



పరిగి మండలం చిగురాల్‌పల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వికారాబాద్: ఏటా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పని దినాల్లో భారీ కోత విధిస్తోంది. సంస్కరణల పేరుతో నిబంధనలను కఠినతరం చేస్తూ పేదలను పనులకు దూరం చేస్తోంది. గడిచిన నాలుగేళ్ల కాలంలో జిల్లాకు కల్పించాల్సిన పని దినాల్లో దాదాపు కోటి పని దినాలకు కోత పెట్టింది. దీంతో పేదల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. వ్యవసాయ పనులులేని కాలంలో వలసల నివారణకు గాను కేంద్ర ప్రభుత్వం 2008లో దేశవ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి అప్రతిహతంగా కొనసాగుతూ వస్తోంది. ఈ పథకం ద్వారా ఏటా లక్షలాది మంది పేదలు ఉపాధి పొందుతూ వస్తున్నారు. అయితే నాలుగేళ్లగా పనిదినాల్లో కోత విధిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల అందుబాటులోకి తెచ్చిన కొత్త నిబంధనలు కూడా ఉపాధి పనులకు కూలీలను దూరం చేస్తోంది. పథకం ప్రారంభమైన సమయంలో కొన్ని పనులకే పరిమితం కాగా ప్రస్తుతం 266 రకాల పనులు చేర్చారు. కేంద్రం నిర్ణయించిన పనులు మాత్రమే చేపట్టాలనే నిబంధన ఉండటం ఇబ్బందిగా మారింది. గతంలో కూలీలు ఉదయం 6గంటలకే పనులకు వెళ్లి వారికి ఇచ్చిన పనులు పూర్తి చేసుకొని మధ్యాహ్న సమయానికి ఇళ్లకు చేరుకునే వారు. ప్రస్తుతం ఉదయం ఒక్కసారి, మధ్యాహ్నం తర్వాత మరోసారి పనులకు సంబంధించిన ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో కూలీలు మండుటెండలోనే గంటల తరబడి అధికారుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఈ కారణంగా కూడా కొంత మంది కూలీలు పనులకు దూరమవుతున్నట్లు సమాచారం.

గత ఏడాదితో పోలిస్తే..

జిల్లాలో 1,86,197 జాబ్‌కార్డులు.. 3,77,087 మంది కూలీలు ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం ప్రస్తుత వేసవిలో కేవలం 60వేల మంది కూలీలే ఉపాధి పనులకు వస్తున్నట్లు తెలిసింది. గత ఏడాది ఇదే సమయంలో లక్షమందికి పైగా కూలీలు పనులకు రాగా ఈ సారి వారి సంఖ్య భారీగా తగ్గింది. ఇటీవల కేంద్రం ఉపాధి కూలీల వేతనం పెంచడంతో రోజువారి కూలి రూ.307కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో సగటున రోజుకు రూ.270 చెల్లిస్తున్నారు. నాలుగేళ్ల కాలంలో జిల్లాకు కోటి పనిదినాల తగ్గించడంతో ఈ ప్రభావం పేదల జీవన స్థితిగతులపైనే కాకుండా గ్రామీణాభివృద్ధిపై కూడా పడింది. గత ఆర్థిక సంవత్సరంలో 67,37,496 పనిదినాలు కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా పెట్టుకొని పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

వసతులు కరువు

ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో వసతులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా నీడకరువైంది. గతంలో నెట్ షెడ్లు, ప్రాథమిక చికిత్స కిట్లు పంపిణీ చేసేవారు. మూడేళ్లుగా వీటి పంపిణీ ఆగిపోయింది. కూలీలకు గ్రామ పంచాయతీలే వసతులు కల్పించాలని అధికారులు చెబుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

వేతన పాట్లు

జిల్లాలో డీఆర్‌డీఏ శాఖలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న 200 మంది ఉద్యోగులకు నెలనెలా వేతనాలు అందడంలేదు. అటెండర్లు, సీసీలు, ఏపీఓలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీఎంలు వేతన వెతలు అనుభవిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు నెలలకు ఒక్కసారి వేతనాలు ఇస్తుండటంతో అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది నుంచి ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా తమను క్రమబద్ధీకరించడం లేదని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని, బయటి పనులకు వెళ్తే రోజుకు రూ.600నుంచి రూ.800ల వరకు వస్తున్నట్లు పలువురు కూలీలు తెలిపారు. ప్రభుత్వం ఉపాధి పని దినాలను పెంచడంతోపాటు వసతులు కల్పించాలని, అలాగే వేతనం కూడా పెంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

ఏటా తగ్గుతున్న పని దినాలు ఇలా..

ఆర్థిక సంవత్సరం	జిల్లాకు కేటాయించిన పని దినాలు
2021 - 22	1.3 కోట్లు
2022 - 23	71.58 లక్షలు
2023 - 24	62 లక్షలు
2024 - 25	59.85 లక్షలు
2025 - 26	33 లక్షలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేవారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.27 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు సోమవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించానన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి అప్‌గ్రేడ్ భవన నిర్మాణం చేయించడం సంతృప్తినిచ్చిందన్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, ఎ–బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: కార్మికులకోసం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆదివారం చేవెళ్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులపై దాడి మొదలు పెట్టిందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను పెట్టుబడి దారి వర్గానికి కొమ్ము కాస్తూ నాలుగు కోడ్‌లుగా చేసి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్త ంచేశారు. కార్మికులు పోరాడి 8 గంటల పని దినాలను సాధించుకున్నారని, కాని మోదీ ప్రభుత్వం 12 గంటల పనిదినాలు తీసుకు వస్తోందని మండిపడ్డారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి కనీస వేత్తనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మెను కార్మికులు, కర్షకులు, ప్రజలు, ప్రజాసంఘాలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలపై ఎండ దెబ్బ

ఉదయం.. సాయంత్రం వేళల్లోనే గిరాకీ

- మధ్యాహ్నం జనం లేక బోసిపోయి కనిపిస్తున్న దుకాణాలు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు బయటకు రాని ప్రజలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



మధ్యాహ్నం గిరాకీ లేక ఖాళీగా కూర్చొన్న దుకాణ యజమాని

కొడంగల్ రూరల్: ఎండల ప్రభావం చిరు వ్యాపారాలపై పడింది. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు ఇళ్లు విడిచి బయటికి రావడం లేదు. దీంతో చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉదయం 10గంటల వరకే జనం రోడ్లపై కనిపిస్తున్నారు. మధ్యాహ్నం అయ్యిందంటే ఎండ వేడిమిని తట్టుకోలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత బయటికి వస్తున్నారు. ఈ సమయంలోనే కొద్దిగా వ్యాపారాలు జరుగుతున్నాయి. పట్టణంలోని దుకాణాలు, కూడళ్ల వద్ద పండ్ల వ్యాపారాలు, పూల కొట్లు జనం లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం గిరాకీలు లేకపోవడంతో వ్యాపారులు ఖాళీగా కూర్చుంటున్నారు. ఈ నెల 6న 35.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, 7వ తేదీ 36.3, 8వ తేదీ 35.3, 9వ తేదీ 35.3, 10వ తేదీ 37.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తా, తాండూరు – మహబూబ్‌నగర్ అంతర్రాష్ట్ర రహదారికి ఇరువైపులా వెలసిన పలు రకాల షాపుల్లో మధ్యాహ్న సమయంలో ఎలాంటి రద్దీ కనిపించడం లేదు. ఎండ వేడిమి నేపథ్యంలో ఉదయం, సాయంత్ర సమయాల్లోనే గిరాకీ ఉంటుందని వ్యాపారులు తెలిపారు. జ్యూస్ పాయింట్లు, కొబ్బరి బొండాం తదితర దుకాణాల వద్దే కొంతమేర జనాలు కనిపిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. నీటిని ఎక్కువగా తాగాలి. కళ్లు తిరగడం, నీరసంగా ఉంటే నీడపాటున కూర్చొని నిమ్మరసం తాగాలి. గొడుగులు, టోపీలు వాడటం మంచిది. పండ్ల రసాలు, ఓఆర్ఎస్ పొడర్‌ను నీటిలో కలుపుకొని తాగాలి. కనీస జాగ్రత్తలు పాటిస్తూ వడదెబ్బ తగలకుండా ఉండొచ్చు.

– డాక్టర్ హీరాలాల్, ఆయుర్వేద వైద్యుడు, కొడంగల్

గొప్ప పోరాటయోధుడు ఠానునాయక్


మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ఠానునాయక్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సబితారెడ్డి, బంజారా నాయకులు

మీర్‌పేట: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం పోరాడిన గొప్పయోధుడు ఠానునాయక్ అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జటోత్ ఠానునాయక్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఠానునాయక్ చరిత్రను, పోరాట స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజనుల అభివృద్ధికి తన వంతు పాత్ర పోషిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, స్థానిక బంజారా నాయకులు జటావత్ శ్రీనివాస్ నాయక్, హామునాయక్, రవీందర్‌నాయక్, సికిందర్‌నాయక్, డా.లక్ష్మణ్‌నాయక్, దేవానంద్ నాయక్, దీప్‌లాల్‌నాయక్, బాలునాయక్, లక్ష్మణ్‌నాయక్, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, బీజేపీ నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, అనిల్‌యాదవ్, రాజ్‌కుమార్, మాదరి రమేష్, బాలరాజ్, సునీత, రజాక్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నెమలి మృతి



కుల్కచర్ల: కుక్కల దాడిలో జాతీయ పక్షి నెమలి మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని రాంనగర్ పంచాయతీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు... గ్రామానికి చెందిన రాములు పొలం సమీపంలో నెమలిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. గమనించిన రైతు నెమలికి నీరు తాపి ధాన్యం వేసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలికి చేరుకున్న అటవీ శాఖ అధికారి మొయీన్ నెమలిని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించి సమీపంలో ఖననం చేశారు.

తినే కూడులో మట్టి పోస్తారా?

- చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చివేయడం దారుణం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: తినే కూడులో మట్టిపోస్తారా.. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలోని హౌస్‌లను కూల్చివేయడం దారుణం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కూల్చివేసిన హౌస్‌లను(ట్యాంకులు) ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో చేప పిల్లలను ఉత్పత్తి చేసే 9 ట్యాంకులను మత్స్యకార సంఘాలతో చర్చించకుండా ఎందుకు కూల్చివేశారని అధికారులను ప్రశ్నించారు. దీంతో మత్స్యకార కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలోని ట్యాంకులను పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కూలచ్చడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.సామేల్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



అనంతగిరి: ఓ బావి లో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన ఆదివారం వికారాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఆలంపల్లి శివారులోని ఒక బావిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం నీటిపై తేలుతుండడాన్ని మధ్యాహ్నం స్థానికులు గమనించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలి వయస్సు 35-40 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై ఎరుపు రంగు పూల చీర, చాక్లెట్ రంగు జాకెట్ ధరించిందని చెప్పారు. పక్కన ఎరుపురంగు టవల్ ఉందన్నారు. మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతురాలు సంబంధీకులు, సమాచారం తెలిసిన వారు ఉంటే వికారాబాద్ ఠాణాలో లేదా 8712670030 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

శామీర్‌పేట్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి లోనైన ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రసూల్‌పుర కు చెందిన కాగితాల సుశీల (60) కూలీ పని చేసి జీవనం సాగిస్తోంది. గత కొంతకాలంగా ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికిలోనైన ఆమె శనివారం ఉదయం పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శామీర్‌పేట పెద్దచెరువు వద్దకు వచ్చింది. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీపులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌కు వ్యతిరేకంగా పోస్టు

యువకుడిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్: ఇన్‌స్టాగామ్‌లో భారతదేశానికి వ్యతిరేకంగా పోస్టు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాల్మాకులకు చెందిన సయ్యద్ ఇక్రముద్దీన్(25)తన ఇన్‌స్టాగామ్ ఖాతాలో పాకిస్తాన్‌కు మద్దతు తెలుపుతూ మన దేశానికి వ్యతిరేకంగా పోస్టు చేశాడు. దీనిని గుర్తించిన స్థానికులు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న సదరు యువకుడి వర్గీయులు ఆదివారం శంషాబాద్ ఠాణాకు రావడంతో.. మరో వర్గం వారు కూడా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాచీ బేకరీపై దాడి

బీజేపీ, బీజేవైఎం నేతలపై కేసు నమోదు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని కరాచీ బేకరీపై శనివారం దాడి చేసిన బీజేపీ నేతలపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... పట్టణంలోని సంగీత మొబైల్స్ పక్కనే ఉన్న కరాచీ బేకరీ పేరును మార్చాలంటూ బీజేవైఎం, బీజేపీ నాయకులు శనివారం బేకరీ ముందు ఆందోళన చేపట్టారు. దాయాది దేశంతో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్‌లోని కరాచీ పేరున్న దుకాణాలు మన దేశంలో కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరాచీ బేకరీ పేరును వెంటనే మార్చాలంటూ ఆందోళన చేయడంతోపాటు పేరుతో ఉన్న బోర్డును మార్చేందుకు యత్నించారు. దీనిపై బేకరీ యజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్బందులకు గురిచేసిన పది మంది బీజేపీ నేతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

పత్తి రైతుకు విత్తన భారం

ఏటా పెరుగుతున్న ధరలు

● ఆందోళనలో కర్షకులు



పొలం సిద్ధం చేసుకుంటున్న రైతులు

నవాబుపేట: ఆరుగాలం శ్రమించి తీసిన పంటకు గిట్టుబాటు రాక నష్టపోతుంటే ఏటేటా పెరుగుతున్న విత్తనాలు, ఎరువుల ధరలతో రైతులకు అదనపు భారం పడుతోంది. గతేడాది పత్తిసాగు సమయంలో వర్షాలు లేక దిగుబడి తగ్గింది. ఈ ఏడాది తాజాగా బీటీ-2 పత్తి విత్తనాలు రూ.38 పెంచడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన పంటగా..

కొంత కాలంగా రైతులు వానాకాలం సాగు ప్రధాన పంటగా పత్తి సాగుచేస్తున్నారు. నవాబుపేట మండలంలోనే గతేడాది 21,539 ఎకరాల్లో సాగు చేశారు. ఈ సారి సైతం అంతే మొత్తంలో సాగు చేసే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు ఒక ఎకరాకు రెండు నుంచి మూడు పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం అవుతాయి. అర కిలో బీటీ పత్తి ప్యాకెట్ ధర గతేడాది రూ.835 ఉండగా ఈ సారి రూ.901కి పెంచారు. ఇప్పటికే రైతులు వానాకాలం సాగుకు తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

వానాకాలంలో నవాబుపేట మండలానికి 1,200 మెట్రిక్ టన్నుల యూరియా, 820 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,380 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 110 మెట్రిక్ టన్నుల ఎంఓపీ ఎరువులు, 50 టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అవసరం అవుతాయని మండలాధికారులు ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం.

రైతులను నమ్మబలుకుతున్న డీలర్లు

డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతులు అడిగన కంపెనీ విత్తనాల మార్కెట్‌లో తక్కువ మొత్తంలో లభిస్తున్నాయని.. తాము బ్లాక్‌లో తెస్తున్నామని రైతులను నమ్మబలికి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు, విత్తనాలు విక్రయించాలి. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవు. రైతులు తప్పని సరిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రశీదు తీసుకోవాలి. ప్రభుత్వం గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి.

– జ్యోతి, మండల వ్యవసాయాధికారి, నవాబుపేట

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



తాండూరుటౌన్: కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు టౌన్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తాండూరులో ఏఎస్‌జీఎంకే ట్రస్టు చైర్మన్ ముజీబ్‌ఖాన్‌తో కలిసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, వైద్య, కంటి శిబిరాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సంపాదించిన దానిలో కొంత మొత్తం పేదలను ఆదుకునేందుకు ఉపయోగించాలన్నారు. తాండూరు ప్రాంతంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ ముజీబ్‌ఖాన్ అభినందనీయుడున్నారు. అనంతరం ముజీబ్‌ఖాన్ మాట్లాడుతూ.. స్వార్థ చింతనను వదిలి పేదలకు ప్రతి ఒక్కరూ తోచిన సహాయ సహకారాలు అందించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం పురుషోత్తం రావు, అబ్దుల్ రవూఫ్, డాక్టర్ సంపత్‌కుమార్, రవి, భగవాన్, రఘు, శివానంద్, సంకేత్, తేజ్ అబ్దుల్లా, మసూద్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు జితేందర్‌రెడ్డిని ఆదుకుంటాం

తాండూరు రూరల్: విద్యుదాఘాతంతో చెరుకు పంట దగ్ధమైన రైతు జితేంధర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పెద్దేముల్ మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. విద్యుదాఘాతంతో దగ్ధమైన జితేందర్‌రెడ్డి చెరుకు పంటను పరిశీలించారు. వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేసి ప్రభుత్వం నుంచి రైతుకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ డీఈ భాను ప్రకాశ్‌ను ఆదేశించారు. అనంతరం పెద్దేముల్ మండల కేంద్రంలోని చిట్టెపు లక్ష్మమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బషీరాబాద్ మండలంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు కరణం పురుషోత్తం రావు, డీవై నర్సింలు, బలవంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అజంఖాన్, సిబ్లి, బుజ్జమ్మ, బాలప్ప, రవీందర్ ఉన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



ధృవపత్రాలతో విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు పది రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. శిక్షణలో భాగంగా విద్యార్థులకు గేమ్స్, స్పోర్ట్స్‌తో పాటు ఖురాన్ పఠనం, నైతిక విలువలు తదితర అంశాలలో తర్ఫీదునిచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు అంజద్ హుస్సేన్, యూనిట్ అధ్యక్షుడు రఫీయొద్దీన్, ఆర్గనైజేషన్ వికారాబాద్ ఇంచార్జి అబ్దుల్ వాసే తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో కేజీబీవీ సత్తా



జి.హారిక



కె.శ్వేత



పి.శిరీష

కొడంగల్ రూరల్: ఆదివారం విడుదల చేసిన ఎప్‌సెట్ ఫలితాల్లో కొడంగల్ కస్తూర్బాగాంధీ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటారు. కె.శ్వేత బీసీ-డీ (25,214ర్యాంకుతో 53.07మార్కులు), జి.హారిక బీసీ-డీ (25469ర్యాంకుతో 52.95మార్కులు), పి.శిరీష బీసీ-ఎ(28771ర్యాంకుతో 51.44మార్కులు) సాధించారు. మొత్తం 23మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఇందులో 17మంది విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయని కస్తూర్బాగాంధీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు.

పరిగి విద్యార్థికి 47వ ర్యాంకు

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన టీజీ ఎప్‌సెట్ ఫలితాల్లో పరిగి విద్యార్థి ప్రతిభ చాటాడు. పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన కనకం గౌరీశంకర్ కుమారుడు ప్రణవ్‌తేజ్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 45వ ర్యాంకు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించడంతో పట్టణ వాసులు అభినందిస్తున్నారు.

447వ ర్యాంకు సాధించిన తాండూరు విద్యార్థి



అభినవ్ రెడ్డి



ప్రణవ్‌తేజ్

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన ఓ విద్యార్థి ఎప్‌సెట్‌లో 447 ర్యాంకు సాధించాడు. మండలంలోని చిట్టిఘనాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న గర్భపల్లి నర్సిరెడ్డి, భ్రమరాంబ దంపతుల కుమారుడు అభినవ్‌రెడ్డి ఇంజనీరింగ్ విభాగంలో ఆదివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో 100.27 మార్కులతో రాష్ట్రస్థాయిలో 447వ ర్యాంకు సాధించాడు. గతంలో విడుదలైన జేఈఈ మెయిన్స్‌లోనూ 97 శాతం మార్కులు సాధించాడు. ఎప్‌సెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన అభినవ్ రెడ్డిని తాత మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, తల్లిదండ్రులు, తాండూరు వాసులు అభినందించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు?



గుప్త నిధుల కోసం తీసిన గుంత

కేశంపేట: గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని పాత బీరప్ప దేవాయలం సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామం నుంచి అల్వాల వైపు వెళ్లే దారిలో పాత బీరప్ప దేవాలయం సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల క్రితం జేసీబీ సాయంతో గుంతను తీసి పూడ్చివేశారు. ఆదివారం సమీపంలోని రైతులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. గుంత సమీపంలో పూజా సామగ్రితో పాటు నిమ్మకాయలు, గుమ్మడికాయలు కన్పించాయి. ఓ కుండను పగులగొట్టిన ఆనవాళ్లు కన్పించాయి. గతంలో పాత బీరప్ప గుడి సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ నరహరి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంత తీసి మళ్లీ పూడ్చిన ఆనవాళ్లు ఉన్నట్టు తెలిపారు.

రెండు కాడెద్దులు తస్కరణ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు రెండు కాడెద్దులను ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని సోలీపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన ప్రకారం.. సోలీపేట్‌లో రైతు తన వ్యవసాయ పొలంలో రోజు మాదిరిగానే శనివారం రాత్రి పశువులకు మేత వేసి ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా కాడెద్దులు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని వాపోయాడు.

వ్యక్తి అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్ : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేట కు చెందిన ఎండీ నజీర్ (65) సునీల్ అనే వ్య క్తి దగ్గర పెయింటింగ్ పని చేయడానికి వస్తుంటాడు. ఈక్రమంలో శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లో నిర్వహిస్తున్న పెయింటింగ్ పనికి కూలీగా వచ్చాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో దుకాణానికి వెళ్తున్నా అని చెప్పి పని దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి రాలేదు. సునీల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

చిలకలగూడ : ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సబిత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన బూక్యా లింగన్న (26) నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో సేల్స్ సర్వీస్ ప్రొవైడర్‌గా పనిచేస్తూ, భార్య పూజిత, రెండేళ్ల కుమారునితో కలిసి సీతాఫల్‌మండి మేడిబావిలో నివాసం ఉంటున్నాడు. గర్భవతి అయిన అతడి భార్య పూజిత ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. శనివారం ఉదయం నుంచి ఆమె పలుమార్లు ఫోన్ చేసినా లింగన్న లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి అతడి స్నేహితుడు బిక్షుకు ఫోన్ చేసి సమాచారం అందించింది. ఆదివారం సాయంత్రం అతను లింగన్న ఇంటికి వెళ్లి తలుపు కొట్టినా స్పందించలేదు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా లింగన్న సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితమే అతను ఉరి వేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన లింగన్న ఆర్థికంగా నష్టపోయాడని, అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతుని సోదరి నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హాష్ ఆయిల్ పట్టివేత

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి నుండి రూ.3 లక్షల విలువ చేసే హాష్ ఆయిల్‌ను ఎస్ఎఫ్‌టీపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో హాష్ ఆయిల్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి నేతృత్వంలో ఆదివారం దాడులు నిర్వహించి మహదేవపురానికి చెందిన సుభాష్, మల్కాజ్‌గిరికి చెందిన రామచంద్రరాజును అదుపులోకి తీసుకున్నారు. నవీన్‌రాజు అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 300 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

1.2 కేజీల గంజాయి పట్టివేత

దూల్‌పేట్‌లోని రహీంపురాలో ఎస్ఎఫ్‌టీపీ టీమ్ దాడులు నిర్వహించి అర్జున్ సింగ్ అనే వ్యక్తి నుంచి 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంజు అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

తప్పిన పెను ప్రమాదం



నుజ్జునుజ్జయిన కారు, విరిగిన విద్యుత్‌స్తంభం

దుద్యాల్: అదుపుతప్పిన కారు విద్యుత్ సంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మండల పరిధిలోని ఈర్లపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన కావలి రాజు, సిద్ధు పని నిమిత్తం నారాయణపేట్ జిల్లా కోస్గి పట్టణానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈర్లపల్లి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం మూడు ముక్కలయింది. కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

సైన్యానికి మద్దతుగా పూజలు



గీతా వాహిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గీతాపారాయణం

అనంతగిరి: యుద్ధ వాతావరణ పరిస్థితులలో భాగంగా భారత్ సైన్యానికి మద్దతుగా వికారాబాద్ పట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం వికారాబాద్ (అనంతగిరి) జిల్లా గీతా వాహిని అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదానంద రెడ్డి, ఆలయ పూజారి అనంతగిరి పంతులు, ముక్తా రెడ్డి, శ్రీరాములు, మాణిక్ రెడ్డి, నారాయణ రాథోడ్, పాపయ్య, రమేష్ గౌడ్, రవిశంకర్, మొణిగారి లావణ్య, జయశ్రీ, వరలక్ష్మి, విజయ, సరిత, అనురాధ, సరళ, రజిత తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగం

దాడి చేసి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు



ఎక్సైజ్‌పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

మొయినాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగిస్తున్న ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఢిల్లీ, గోవా రాష్ట్రాలకు చెందిన రూ.4 లక్షల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తోలుకట్టలో నగరానికి చెందిన తేజా రెడ్డి ఫాంహౌస్ ఉంది. శనివారం రాత్రి ఇక్కడ ఓ ఫంక్షన్ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగిస్తున్నారు. సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అర్ధరాత్రి ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఫంక్షన్‌లో వినియోగిస్తున్న ఢిల్లీకి చెందిన 50 బ్లాక్ లేబులు బాటిళ్లు, గోవాకు చెందిన నాలుగు యువాస్‌రీగల్ బాటిళ్లు, తెలంగాణకు చెందిన 3 లిక్కర్ బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..



భార్యతో రవి (ఫైల్)

దుండిగల్: చిన్న నాటి స్నేహితురాలిని ప్రేమించి పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, యాపర్ల గ్రామానికి చెందిన తిమ్మరాజు రవి(25) కుటుంబం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి కూకట్‌పల్లి, శంషీగూడలో నివాసముంటోంది. రవి కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో తన స్నేహితురాలు నీలవేణితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రెండేళ్ల క్రితం వారు పెద్దలను ఎదిరించి ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. గత 8 నెలలుగా వారు బౌరంపేటలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. రవి కారు డ్రైవర్‌గా పని చేస్తుండగా నీలవేణి ఇంటి వద్దనే ఉంటుంది. కొద్ది రోజులుగా వీరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ నెల 10న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు మధ్యాహ్నం తన ఇంటికి వచ్చిన తల్లితో కలిసి నీలవేణి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రవి తన తల్లికి ఫోన్ చేసి తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తనకు బతకాలని లేదని చెప్పి విలపించాడు. దీంతో ఇంటికి రావాలని కోరగా ఫోన్ పెట్టేశాడు. ఆదివారం ఉదయం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తల్లి, సోదరుడు బౌరంపేటకు వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారులో మంటలు

ప్రమాదం నుంచి బయటపడిన డ్రైవర్



శంషాబాద్ రూరల్: రహదారిపై వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని కారు దగ్ధమైంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... నగరం నుంచి టాటా జెస్ట్ కారు ఆదివారం మధ్యాహ్నం షాద్‌నగర్ వైపు వెళ్తుంది. బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి శివారులో ఉన్న రైల్వే వంతెనపైకి రాగానే కారులో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ హుస్సేన్ వెంటనే కారును నిలిపివేసి కిందకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పాటు ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మంటలకు కారు ఆహుతైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.